ఓటరు మహాశయా.. ధన్యవాదాలు

కృతజ్ఞతలు తెలిపిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, జూన్ 1: కోట్లాది మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ఈ ఎన్నికల్లో నిజమైన విజేతలు ఓటర్లేనని చాటుకున్నారని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల నిర్వహణలో అనేక సవాళ్లు, సందేహాలను అధిగమించి పెద్దయెత్తున పోలింగ్ స్టేషన్లకు తరలివచ్చి ఓటు వేశారని తెలిపింది. ఏప్రిల్ 19న ప్రారంభమైన మొదటి విడత లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ శనివారం జరిగిన ఏడో విడత ఎన్నికలతో విజయవంతంగా ముగిసింది. దీంతో ఎన్నికల సంఘం ఒక ప్రకటన విడుదల చేసి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపింది. పోలింగ్ విజయవంతంగా ముగియడానికి సహకరించిన ఓటర్లు, పోలింగ్ సిబ్బంది, భద్రతా బలగాలు, రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు కృతజ్ఞతలు తెలిపింది.

ఎగ్జిట్ పోల్స్.. ఏకపక్షం

- ఎన్డీయేకు మెజారిటీ సీట్లు ఇచ్చిన సంస్థలు
- క్షేత్రస్థాయి పరిస్థితులతో కుదరని పొంతన
- గుంభనంగా ఓటర్లు.. ప్రజానాడి దొరకలేదా?
- 'ఎగ్జాక్ట్ పోల్స్' కాదంటున్న రాజకీయ విశ్లేషకులు



న్యూఢిల్లీ, జూన్ 1: సార్వత్రిక సమరం ముగిసింది. అందరూ ఉత్కంఠగా ఎదురుచూసిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు శనివారం సాయంత్రం వెలువడ్డాయి. దేశంలో మరోసారి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని మెజారిటీ సంస్థలు తేల్చాయి. గత ఎన్నికల్లో బీజేపీ సాధించిన సీట్లే దాదాపుగా ఈ ఎన్నికల్లోనూ సాధించవచ్చని అంచనా వేశాయి. ఇండియా కూటమి 150 సీట్లకు అటూఇటుగా వచ్చి ఆగిపోవచ్చని జోస్యం చెప్పాయి. అయితే, ఎగ్జిట్ పోల్స్ క్షేత్రస్థాయి పరిస్థితులకు అద్దం పట్టాయా? ప్రజానాడిని గుర్తించాయా? అంటే అనుమానమే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఎన్నికలకు ముందు నుంచి ఈసారి ఎన్డీయే భారీ విజయం సాధించబోతున్నదని బీజేపీ సృష్టించిన హైప్‌లో ఎగ్జిట్ పోల్ ఏజెన్సీలు కూడా చిక్కుకున్నాయని భావిస్తున్నారు. ఓటర్లు అనేక కారణాలతో ఈసారి ఎవరికి ఓటు వేశామనే విషయాన్ని బయటపెట్టకుండా గుంభనంగా ఉండటం, ఏజెన్సీల భయాలు కూడా అసలు ప్రజానాడి ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడి కాకపోవడానికి కారణాలని విశ్లేషిస్తున్నారు. ఒకవేళ ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైన అంచనాలే ప్రజాభిప్రాయమైతే.. మూడో దశ పోలింగ్ తర్వాత బీజేపీ నేతల్లో ఎందుకు ఆందోళన మొదలైందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మూడో దశ తర్వాత బీజేపీ నేతలు మతపరమైన అంశాలను తెరమీదకు తెచ్చి ప్రజల్లో ఉద్వేగం పెంచే ప్రయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఒకవైపు యోగేంద్ర యాదవ్ వంటి సీనియర్ సెఫాలజిస్టులు, ప్రశాంత్ భూషణ్ లాంటి ప్రముఖులు సైతం ఈసారి బీజేపీకి ఎదురుగాలి వీస్తున్నదని చెప్తుండగా, ఎగ్జిట్ పోల్స్ మాత్రం ఇందుకు విరుద్ధంగా చెప్పడం గమనార్హం.

అదే నిజమైతే గుండు గీయించుకుంటా!

ఎగ్జిట్ పోల్స్‌ను ఇండియా కూటమి నేతలు సైతం కొట్టిపారేస్తున్నారు. ఈ ఎగ్జిట్ పోల్స్ అన్ని జూన్ 4న తప్పవుతాయని, మూడో సారి మోదీ ప్రధాని అయితే తాను గుండు గీయించుకుంటానని ఆప్ నేత సోమ్‌నాథ్ భారతి సవాల్ విసిరారు.

ఎగ్జిట్ పోల్స్ పూర్తిగా అశాస్త్రీయం

ఎగ్జిట్ పోల్స్ అంచనాలను సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సైతం కొట్టిపారేశారు. న్యూస్ ఛానళ్లు అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా సీట్ల సంఖ్యను పెంచేశాయని, తద్వారా అధికారులపై ఒత్తిడి పెంచాయని ఆయన ఆరోపించారు. ఇండియా కూటమి కచ్చితంగా 295కు పైగా సీట్లను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఎగ్జిట్ పోల్స్ పూర్తిగా అశాస్త్రీయమైనవని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ పేర్కొన్నారు. గత ఏడాది ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ తప్పు అయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తాము అసలైన ఓట్లు ఏం చెప్తాయనేది చూడటానికి సంతోషంగా ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ పూర్తిగా మోదీ ఆడిస్తున్న మానసిక ఆటలని, అసలు ఫలితాలు చాలా భిన్నంగా ఉంటాయని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.

సంస్థ	ఎన్డీఏ	ఇండియా	ఇతరులు
సీఎన్ఎన్ న్యూస్18	353-383	125-140	42-52
దైనిక్ భాస్కర్	281-350	145-201	33-49
టైమ్స్‌నౌ - ఈటీజీ	358	152	33
ఎన్డీటీవీ	361	145	37
ఏబీపీ సీ-ఓటర్	353-383	152-182	04-12
జన్‌కీబాత్	362-392	141-161	10-20
రిపబ్లిక్ - మ్యాట్రిజ్	353-368	118-133	43-48
న్యూస్ నేషన్	342-378	153-169	21-23
ఇండియా న్యూస్ - డీ-డైనమిక్స్	371	125	47
ఇండియాటీవీ - సీఎన్ఎక్స్	371-401	109-139	28-38

కేరళలో ఖాతా తెరవనున్న బీజేపీ?

తిరువనంతపురం, జూన్ 1: కేరళలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ సంస్థలు ఆసక్తికర అంచనాలు వెలువరించాయి. కేరళలో ఈసారి బీజేపీ ఖాతా తెరిచే అవకాశం ఉందని మెజారిటీ సంస్థలు పేర్కొన్నాయి. కమలం పార్టీకి ఇక్కడ ఒకటి నుంచి మూడు లోక్‌సభ స్థానాలు దక్కవచ్చని పేర్కొన్నాయి. తిరువనంతపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ శశి థరూర్‌ను బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఓడించవచ్చని ఇండియా టుడే - యాక్సిస్ మే ఇండియా ఎగ్జిట్ పోల్ అంచనా వేసింది. త్రిస్సూర్‌లో బీజేపీ అభ్యర్థి, నటుడు సురేశ్ గోపి గెలవొచ్చని టైమ్స్ నౌ జోస్యం చెప్పింది. తమిళనాడులో బీజేపీకి ఒకటి నుంచి మూడు స్థానాలు దక్కవచ్చని ఎగ్జిట్ పోల్స్ సంస్థలు అంచనా వేశాయి. తమిళనాడు, కేరళలో విస్తరించాలని, కొన్ని సీట్లయినా గెలుచుకోవాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నించింది.

ఓటే ముందు.. తర్వాతే అంత్యక్రియలు

జెహానాబాద్ (బీహార్): ప్రజాస్వామ్యంలో ఐదేండ్లకు ఒకసారి వచ్చే ఓటు ఎంత ముఖ్యమైనదో మరోమారు నిరూపితమైంది. చనిపోయిన తల్లి అంత్యక్రియలను సైతం వాయిదా వేసిన ఓ కుటుంబం తొలుత ఓటుకే జై కొట్టింది. బీహార్‌లోని జెహానాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని దేవ్‌కులి గ్రామంలో జరిగిందీ ఘటన. దేవ్‌కులి గ్రామానికి చెందిన మిథిలేశ్ యాదవ్ తల్లి (80) మరణించారు. కుటుంబ సభ్యులంతా కలిసి కూర్చుని చర్చించుకున్నారు. పుట్టెడు దుఃఖంలోనూ ఓటుకే జై కొట్టారు. ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాతే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. అనుకున్నట్టే అందరూ కలిసి ఓటు వేసి వచ్చిన తర్వాత తల్లికి అంత్యక్రియలు నిర్వహించారు.

వాణిజ్య సిలిండర్ ధర 69 తగ్గింపు

లోక్‌సభ చివరి విడత ఎన్నికల వేళ కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 1: లోక్‌సభ చివరి విడత ఎన్నికల వేళ కేంద్రం శనివారం వాణిజ్య సిలిండర్ ధరలను తగ్గించింది. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.69 తగ్గించింది. దీంతో ప్రస్తుతం ఈ సిలిండర్ ధర రూ.1,676గా ఉన్నది. మరోవైపు విమానయాన ఇంధన (ఏటీఎఫ్) ధర కిలో లీటర్‌కు రూ.6,673.87(6.5 శాతం) తగ్గింది. ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ప్రతి నెల 1న అంతర్జాతీయ చమురు ధరలు, విదేశీ మారక రేటు సగటు ఆధారంగా ఏటీఎఫ్, వంట గ్యాస్ ధరలను సవరిస్తాయి.

ముగిసిన ప్రధాని మోదీ ధ్యానం

కన్యాకుమారి, జూన్ 1: ప్రధాని నరేంద్ర మోదీ కన్యాకుమారిలో తన 45 గంటల ధ్యానాన్ని శనివారం ముగించారు. మోదీ కన్యాకుమారిలో చేసింది ఫొటో షూట్ స్టంట్ అని.. అది ఆధ్యాత్మిక సందర్శన ఎంత మాత్రం కాదని ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ విమర్శించారు. 'మోదీజీ ఎలాంటి ధ్యానం చేయడం లేదు. కేవలం ఫొటో షూట్స్ మాత్రమే జరుగుతున్నాయి. అవి అయిపోగానే ఆయన వెనక్కు వస్తారు' అని యాదవ్ అన్నారు. ఎన్నికల చివరి దశ ప్రచారం ముగింపు రోజైన గురువారం మోదీ ధ్యానం కోసం కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే.

కలెక్టర్లకు అమిత్ షా బెదిరింపులు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: కేంద్ర హోం మంత్రి అమిత్ షా జిల్లాల కలెక్టర్లకు ఫోన్లు చేసి నిస్సిగ్గుగా, బాహాటంగా బెదిరిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. జిల్లా రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించే కలెక్టర్లు 150 మందికి. అమిత్ షా ఫోన్లు చేశారని, దీన్ని బట్టి బీజేపీ ఎంత నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నదో స్పష్టమవుతున్నదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ట్వీట్‌చేశారు. ప్రజల అభిప్రాయమే గెలుస్తుందని, జూన్ 4న అమిత్ షా, నరేంద్ర మోదీ, బీజేపీకి ఎగ్జిట్ తప్పదని అన్నారు. ఇండియా జనబంధన్ విజేతగా నిలుస్తుందన్నారు. అధికారులు నిర్భయంగా విధులు నిర్వహించాలన్నారు.

ఇండిగో విమానానికి మళ్లీ బాంబు బెదిరింపు

అత్యవసర ల్యాండింగ్

ముంబై, జూన్ 1: ఇండిగో ఫ్లైట్‌కు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. శనివారం 172 మంది ప్రయాణికులతో చెన్నై నుంచి ముంబై బయల్దేరిన ఇండిగో ఫ్లైట్ అత్యవసరంగా ల్యాండ్ చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. నిచ్చెనల సాయంతో ప్రయాణికులను బయటకు తీసుకొచ్చినట్టు తెలిసింది. విమానానికి బాంబు బెదిరింపులు రావటం.. అత్యవసర ల్యాండింగ్ ప్రక్రియను చేపట్టడం.. వారం రోజుల్లో ఇది రెండోసారి. మే 28న ఇండిగో వారణాసి ఫ్లైట్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి.

2-3% తగ్గిన పోలింగ్!

2014, 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే పడిపోయిన ఓటింగ్ శాతం

న్యూఢిల్లీ, జూన్ 1: లోక్‌సభ ఎన్నికల యుద్ధం ముగిసింది. 2014, 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 2024లో పోలింగ్ శాతాల్లో కొంత తేడా కనిపిస్తున్నది. గత రెండు లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్ తగ్గినట్టు కనిపిస్తున్నది. శనివారం ముగిసిన తుది దశతో సహా మొత్తం ఏడు దశల్లో సరాసరిన దాదాపుగా 65 శాతం ఓటింగ్ నమోదైనట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల పోలింగ్ శాతం 67.4 కంటే ఇది రెండు శాతం తక్కువ కావడం గమనార్హం. 2014తో పోలిస్తే 2019లో ఒక శాతం పోలింగ్ పెరుగ్గా, ఈసారి కోత పడింది. 2024 లోక్‌సభ ఎన్నికల తొలి ఆరు దశల తుది పోలింగ్ శాతాలను కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించగా.. శనివారం జరిగిన తుది విడతలో రాత్రి 11.45 గంటల సమయానికి 61.63 శాతం నమోదైందని తెలిపింది. గత దశల ట్రెండ్‌ను పరిశీలిస్తే తుది పోలింగ్ శాతంలో 3-4 శాతం మార్పు ఉండే అవకాశం ఉన్నది. ఎలా చూసినా 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే మొత్తంగా 2-3 శాతం తక్కువ పోలింగ్ నమోదు అయినట్టు కనిపిస్తున్నది.

గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో ఇలా..

సంవత్సరం	పోలింగ్ శాతం
2014	66.44
2019	67.4

2024 లోక్‌సభ ఏడు దశల్లో ఇలా..

దశ	పోలింగ్ శాతం
1	66.14
2	66.71
3	65.68
4	69.16
5	62.20
6	63.36
7	61.63
సరాసరి	64.98

నేడు అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఫలితాలు

న్యూఢిల్లీ, జూన్ 1: అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం విడుదల కానున్నాయి. ఉదయం 6 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందని ఈసీ పేర్కొన్నది. ఎన్నికల షెడ్యూల్‌లో ఈ రెండు రాష్ట్రాల్లోనూ 4వ తేదీనే కౌంటింగ్ ఉంటుందని ప్రకటించిన ఈసీ.. తర్వాత రెండు రోజుల ముందుకు జరిపింది. అరుణాచల్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలం జూన్ 2కు ముగియనుండటమే దీనికి కారణం. ఏప్రిల్ 19న లోక్‌సభతోపాటు ఈ రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 60 స్థానాలు ఉన్న అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో పోలింగ్‌కు ముందే 10 నియోజకవర్గాలు ఏకగ్రీవం కాగా.. మిగతా 50 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. సిక్కింలోని 32 స్థానాల్లో పోలింగ్ జరిగింది.

చివరి దశలో 62% పోలింగ్

- 8 రాష్ట్రాల్లోని 57 స్థానాలకు ఎన్నికలు
- ముగిసిన లోక్‌సభ సంగ్రామం
- పశ్చిమ బెంగాల్‌లో కొన్నిచోట్ల హింసాత్మక ఘటనలు
- ఈ నెల 4న ఫలితాల వెల్లడి
- ఏపీ, ఒడిశా అసెంబ్లీ రిజల్ట్ స్కూడా

ఒడిశాలోని ఓ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన మహిళా ఓటర్లు

న్యూఢిల్లీ, జూన్ 1: లోక్‌సభ ఎన్నికల సంగ్రామం ముగిసింది. దాదాపు గత రెండు నెలలుగా కొనసాగుతున్న ఈ ఎన్నికల పర్వంలో చివరి(ఏడో) దశ పోలింగ్ శనివారం జరిగింది. 8 రాష్ట్రాల్లోని 57 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రాత్రి 11.45 గంటల వరకు 61.63 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమ బెంగాల్‌లో స్వల్ప హింసాత్మక ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఈసీ అధికారులు పేర్కొన్నారు. ప్రధాని మోదీ పోటీచేస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నియోజకవర్గానికి ఈ తుది దశలోనే పోలింగ్ జరిగింది. పంజాబ్‌లోని 13 స్థానాలు, యూపీ-13, హిమాచల్‌ప్రదేశ్-4, పశ్చిమ బెంగాల్-9, బీహార్-8, ఒడిశా-6, జార్ఖండ్‌లో మూడు స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. అదేవిధంగా ఒడిశా అసెంబ్లీకి కూడా చివరి దశలో భాగంగా 42 స్థానాలకు, హిమాచల్‌లోని ఆరు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు నిర్వహించారు. ఏప్రిల్ 19న తొలి దశతో ఎన్నికల పర్వం ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలి ఆరు దశలో వరుసగా 66.14, 66.71, 65.68, 69.16, 62.2, 63.36 శాతాల పోలింగ్ నమోదైంది.

పశ్చిమబెంగాల్‌లో ఘర్షణలు

పశ్చిమబెంగాల్ సందేశ్‌ఖాలీలోని బైరామరిలో ఎన్నికల అక్రమాల ఆరోపణలపై బీజేపీ, టీఎంసీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేయడంతోపాటు టియర్‌గ్యాస్ ప్రయోగించారు. ఘర్షణల్లో ముగ్గురికి గాయాలయ్యాయని బసిర్‌హత్ ఎస్పీ తెలిపారు. జాదవ్‌పూర్, డైమండ్ హార్బర్ నియోజకవర్గాల్లోనూ ఘర్షణలు చోటుచేసుకొన్నాయి. పోలింగ్ కేంద్రాల్లోకి తమ పార్టీ ఏజెంట్లకు రాకుండా అడ్డుకొన్నారని ఆరోపిస్తూ టీఎంసీ, బీజేపీ, ఐఎస్ఎఫ్ మద్దతుదారులు జాదవ్‌పూర్‌లో గొడవపడ్డారు. జాదవ్‌పూర్‌లోని భాంగర్ ఏరియాలో ఒకరిపై ఒకరు నాటుబాంబులు వేసుకొన్నట్టు సమాచారం.

ఈవీఎంను చెరువులోకి విసిరి..

పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా కుల్తాలిలో పోలింగ్ కేంద్రాల్లోకి చొరబడిన కొంత మంది.. ఈవీఎంలను తీసుకెళ్లి చెరువులో పడేశారు. జయనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని బేనిమాధవ్‌పూర్ ఎఫ్‌పీ స్కూల్ పోలింగ్ కేంద్రంలోకి ఏజెంట్లను రానివ్వకుండా అడ్డుకొన్న నేపథ్యంలో ఉదయం సమయంలో ఈ ఘటన జరిగినట్టు తెలుస్తున్నది. ఆగ్రహించిన స్థానికులు.. వీవీప్యాట్‌తో సహా ఈవీఎంను, పోలింగ్‌కు సంబంధించిన పలు పేపర్లను తీసుకెళ్లిపోయారు.

4న ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్

లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఈనెల 4న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం అవుతుందని ఎన్నికల సంఘం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. కౌంటింగ్ ఏర్పాట్లు, కౌంటింగ్ ప్రక్రియ, ఈవీఎంలు, పేపర్ ట్రయల్ మెషిన్ల స్టోరేజ్‌కు సంబంధించి కొన్ని తాజా మార్గదర్శకాలను షేర్ చేసింది. రిటర్నింగ్ ఆఫీసర్ టేబుల్‌పై మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపింది.

నేడు తిరిగి జైలుకు కేజ్రీవాల్

- కోర్టులో దక్కని ఊరట
- బెయిల్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ, జూన్ 1: మనీలాండరింగ్ కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈనెల 5న తీర్పు వెల్లడిస్తామని స్థానిక ప్రత్యేక కోర్టు వెల్లడించింది. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా సుప్రీంకోర్టు గత నెల 12న కేజ్రీవాల్‌కు 21 రోజుల బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఈ నెల 2న లొంగిపోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఆదివారం కేజ్రీవాల్ లొంగిపోవాల్సి ఉన్న నేపథ్యంలో శనివారమే బెయిల్ పిటిషన్‌పై తీర్పునివ్వాలన్న కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభ్యర్థనను ప్రత్యేక కోర్టు జడ్జి తిరస్కరించారు. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరును ఈడీ తరపు న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు.

పరారీలో ప్రజ్వల్ రేవణ్ణ తల్లి!

హసన్, జూన్ 1: జేడీఎస్ బహిష్కృత ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులకు ప్రజ్వల్ తల్లి భవానీ రేవణ్ణ షాక్ ఇచ్చారు. కుమారుడిపై ఆరోపణలు, కిడ్నాప్ కేసుకు సంబంధించి విచారించేందుకు శనివారం అందుబాటులో ఉండాలని నోటీసుల్లో కోరగా.. అధికారుల బృందాలు వెళ్లే సమయానికి ఆమె ఇంట్లో లేరు. ఉదయం హోలెనరసిపుర ఇంటికి వెళ్లిన అధికారులు సాయంత్రం వరకు అక్కడే వేచిచూడాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆమె ఇంటికి రాలేదు. ఈ నేపథ్యంలో ఆమెను వెతికేందుకు సిట్ బృందాలను ఏర్పాటు చేయనున్నదని తెలిపాయి. ప్రజ్వల్‌పై లైంగిక ఆరోపణలకు సంబంధించిన కేసులో ప్రశ్నించేందుకు శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంట్లో అందుబాటులో ఉండాలని సిట్ గురువారం భవానీ రేవణ్ణకు నోటీసులు ఇచ్చింది.

సర్టిఫికెట్ ఉన్నా.. డ్రైవింగ్ టెస్ట్ తప్పనిసరి

న్యూఢిల్లీ : డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించి కేంద్రం తీసుకొచ్చిన నూతన నిబంధనావళి జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మీడియాలో వచ్చిన వార్తా కథనాలు తీవ్ర గందరగోళానికి దారితీశాయి. ప్రభుత్వ అనుమతి పొందిన ప్రైవేట్ డ్రైవింగ్ స్కూల్ (ఏడీటీసీ) నుంచి సర్టిఫికెట్స్ పొందాక డ్రైవింగ్ టెస్ట్ అవసరం లేదన్న వార్తలు చక్కర్లు కొట్టాయి. దీంతో ఈ అంశంపై మరింత స్పష్టతనిస్తూ కేంద్ర శనివారం కీలక ప్రకటన చేసింది. ప్రైవేట్ డ్రైవింగ్ స్కూల్ నుంచి సర్టిఫికెట్స్ అందుకున్నప్పటికీ, ఆర్టీవో కేంద్రాల వద్ద డ్రైవింగ్ టెస్ట్‌ను ఎదుర్కొనటం తప్పనిసరి అని తేల్చిచెప్పింది. పాత నిబంధనల్లో మార్పులు జారీచేయలేదని తెలిపింది. డ్రైవింగ్ టెస్ట్ తప్పనిసరి..అని వివరించింది.

వైట్‌హౌస్‌ను సందర్శించిన స్పెల్లింగ్ బీ ఫైనలిస్టులు

వాషింగ్టన్ : స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీ విజేత, తెలంగాణకు చెందిన బృహత్ సోమతో పాటు ఎనిమిది మంది ఫైనలిస్టులు శుక్రవారం అమెరికా అధ్యక్ష భవనమైన వైట్ హౌస్‌ను సందర్శించారు. సూపర్ బౌల్ చాంపియన్‌షిప్ సీజన్‌లో కాన్సాస్ సిటీ చీఫ్స్ విజయం సాధించిన నేపథ్యంలో వైట్‌హౌస్‌లోని సౌత్ లాన్‌లో శుక్రవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీంట్లో పాల్గొనేందుకు స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీ ఫైనలిస్టులను ఆహ్వానించారు. వీరంతా బైడెన్‌ను కలవలేక పోయినా సూపర్ బౌల్ చాంపియన్‌షిప్ విజేతలను చూశారు. ఈ పోటీలోని మొత్తం తొమ్మిది మంది ఫైనలిస్టుల్లో భారత సంతతికి చెందినవారు అత్యధికంగా అయిదుగురు ఉన్నారు. పిల్లలందరూ తమ తల్లిదండ్రులతో కలిసి వైట్ హౌస్‌లో ఫొటోలు తీసుకున్నారు.

మే నెలలో 9,500 మందిపై వేటు

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల కోత కొనసాగుతూనే ఉన్నది. మే నెలలో 9,500 మంది తొలగింపునకు గురయ్యారని తాజా గణాంకాలు వెల్లడించాయి. మొత్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు 89 వేల మందికిపైగా ఉద్యోగాలు కోల్పోయినట్లు తేలింది. 'టెస్లా' కంపెనీలో చార్జింగ్ టీమ్ అంతటినీ ఎలాన్ మస్క్ ఇంటికి పంపారు. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థ తోషిబా జపాన్‌లో 4వేలకుపైగా ఉద్యోగాల తొలగింపును చేపట్టింది. మైక్రోసాఫ్ట్ 'ఎక్స్‌బాక్స్' డివిజన్‌లో లేఆఫ్‌లు ప్రకటించింది. గేమింగ్ స్టూడియోలను మూసేస్తున్నది. టిక్‌టాక్ 1000 ఉద్యోగాలకు కోత పెట్టింది. గూగుల్, వాల్‌మార్ట్‌లలో లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. ఆర్థికమాంద్యంతో సిబ్బంది జీత భత్యాల భారాన్ని తగ్గించుకునేందుకు కంపెనీలు ఈ చర్యలు చేపడుతున్నాయి.

సల్మాన్ హత్యకు కుట్ర.. నలుగురి అరెస్టు

ముంబై : బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ హత్యకు కుట్ర పన్నిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందిన నలుగురు సభ్యులను నవీ ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల బాంద్రాలో సల్మాన్‌ఖాన్ ఇంటి వెలుపల కాల్పులు జరిగిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.అరెస్టయిన వారిని ధనంజయ్ టేపసింగ్ అలియాస్ అజయ్ కశ్యప్, గౌరవ్ భాటియా అలియాస్ నహ్వి, వాస్పిఖాన్ అలియాస్ వసీం చిక్నా, రిజ్వాన్‌ఖాన్ అలియాస్ జావెద్‌ఖాన్‌గా గుర్తించినట్టు తెలిపారు.ఈ నలుగురు బిష్ణోయ్ సోదరులతో ఉన్నారని, బిష్ణోయ్ సోదరుల ఆదేశానుసారం సల్మాన్‌ఖాన్‌పై దాడి చేసేందుకు ఆయన ఫామ్‌హౌస్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారని పోలీసులు తెలిపారు.

44 మందికి మరణ శిక్ష విధించిన యెమన్ కోర్టు

కైరో, జూన్ 1: సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి సహకరించారన్న ఆరోపణతో యెమన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల ఆధ్వర్యంలో నడిచే న్యాయస్థానం 44 మందికి శనివారం మరణశిక్ష విధించింది. శిక్షపడిన వారిలో ఆ గ్రూపులకు సహాయం చేశారని, గూఢచార్యం నడిపారన్న ఆరోపణలు ఎదుర్కొన్న అద్నాన్ అల్-హజారీ అనే వ్యాపారవేత్త కూడా ఉన్నారు. శత్రుత్వం కారణంగా 2015 నుంచి సౌదీ ప్రభుత్వం నేతృత్వంలోని కొన్ని సంస్థలతో హౌతీలకు యుద్ధం నడుస్తున్నది. కాగా, యెమెన్‌లో అంతర్యుద్ధం కారణంగా వేలాది మందిని హౌతీలు జైలులో ఉంచారు. సౌదీ అరేబియా దేశానికి చెందిన సంస్థలతో సంబంధాలు పెట్టుకున్న వారికి కోర్టులు కఠిన శిక్షలు విధిస్తూ ఉంటాయి.



చెక్కతో ఉపగ్రహం

టోక్యో, జూన్ 1: జపాన్‌లోని క్యోటో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే మొదటిసారిగా చెక్కతో ఉపగ్రహాన్ని తయారుచేశారు. మంగోలియా చెక్కతో చేసిన ఈ ఉపగ్రహం నలువైపులా దాదాపు 10 సెంటీమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ ఉపగ్రహాన్ని సెప్టెంబర్‌లో కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ ఎక్స్ రాకెట్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపించనున్నారు. సాధారణంగా ఉపగ్రహాలు వివిధ రకాల లోహాలత